అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

బోడుప్పల్: చెంగిచర్ల జలమండలి కార్యాలయం ఎదురుగా ఉన్న విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల ఆవరణలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చకిషన్ కమిషనర్ మంగళవారం వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల పచ్చగా ఉన్న చెట్లను నరికి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. దీనిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దండు రమేష్, మాచర్ల కనకయ్య ఉన్నారు.

వెంకట సాయినగర్ అధ్యక్షుడిగా నిరంజన్



రామంతాపూర్: డివిజన్ పరిధిలోని వెంకట సాయినగర్ సంక్షేమ సంఘానికి మంగళవారం జరిగిన ఎన్నికల్లో అల్లాడి నిరంజన్‌గౌడ్ విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గెలిపించిన కాలనీ ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. కాలనీలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే, కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరింపజేస్తామన్నారు.

టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్‌గా మోహన్



మల్లాపూర్: టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్‌గా హెచ్‌ఆర్.మోహన్ నియమితులైన సందర్భంగా మంగళవారం నాచారంలోని బీఎస్‌ఏ కార్యాలయంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లారాధాకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హెచ్‌ఆర్. మోహన్ భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ నేతలు రాజిరెడ్డి, ప్రమోద్ మహాజన్, విజయ్‌కుమార్, సంజీవ, సుధాకర్ తదితరులున్నారు.



కాప్రా సర్కిల్ కార్యాలయంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నివాళులర్పించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

గాంధేయ మార్గం ఆదర్శనీయం

ఉప్పల్, మల్కాజిగిరి జోన్ల పరిధిలో మహాత్మగాంధీ 76వ వర్ధంతి సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు , స్వచ్ఛంద సంస్థలు, కులసంఘాల నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. గాంధేయ మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని, సత్యం అహింస మార్గాలే ఆయుధంగా స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుకు నడిపించారని పలువురు నేతలు కొనియాడారు. పలు కాలనీలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటాలు, విగ్రహాలకు అంజలి ఘటించారు. – ఉప్పల్ మల్కాజిగిరి జోన్ల బృందం



మచ్చబొల్లారంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



నేరేడ్‌మెట్‌లో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జగదీశ్వర్‌గుప్తా



అల్వాల్‌లో కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి



చక్రిపురంలో కాలనీ అధ్యక్షుడు రాఘవరెడ్డి



హెచ్‌బీకాలనీలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్



నాచారంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ..



రామాంతపూర్‌లో..



మల్లాపూర్‌లో పూలమాలలు వేస్తూ..



గౌతంనగర్‌లో..



కార్పొరేటర్ శ్రవణ్, తదితరులు

కుష్ఠువ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి



ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: కుష్ఠువ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌ముదిరాజ్‌లతో కలిసి వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కుష్ఠువ్యాధి నివారణ దినోత్సవం, మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా ఆరోగ్యకేంద్రాన్ని ఆయన సందర్శించారు. ప్రాణాంతకమైన ఈ వ్యాధితో అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇలాంటి వ్యాధులు దరిచేరకుండా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని, దీనికి ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. డాక్టర్ సౌందర్యలత, డా. కరుణాదేవి, సిగ్మతుల్లా, బోగ ప్రకాశ్, బీఆర్‌ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, పోగుల దయాకర్‌రెడ్డి, ఆకుల మహేందర్, కిషోర్, కొండల్ రెడ్డి, మాస శేఖర్, పాపిరెడ్డి, సుక్క కిరణ్ తదితరులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం

కాప్రా: రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కాప్రా మండల డిప్యూటీ తహసీల్దార్ రాధిక, కుషాయిగూడ ఏఎస్సై అశోక్‌రెడ్డి అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం గాంధీనగర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పౌరుల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా కృషి చేయాలని సూచించారు. సమాజంలో పౌరలందరికీ రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందని, ప్రజల రక్షణ కోసమే చట్టాలు ఉన్నాయని, పౌరులు తమ హక్కులను కాపాడుకోవాలన్నారు. జీహెచ్‌ఎంసీ, వైద్య సిబ్బంది దశరథ్, మంజుల, ప్రేమలత, ప్రసన్న, మాధవి, అరుణ, రాధిక, గాంధీనగర్ వాసులు మహేష్, భిక్షపతి, నర్సింగ్, శివరామకృష్ణ, సత్యనారాయణ, వెంకట్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



కాప్రా గాంధీనగర్‌లో పౌరహక్కుల అవగాహన కార్యక్రమం

పశు వైద్యశాల సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికులతో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని పశు వైద్యశాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మల్కాజిగిరిలోని పశువైద్యశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి అనిమల్ ఎగ్జామినేషన్ టేబుల్, షెడ్డు, వాటర్ ట్యాంక్, మేల్ అటెండర్ అవసరముందని ఆయనకు వివరించారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

నిరుపేద విద్యార్థులకు చేయూత

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్ఐఈటీ కళాశాలలో బీటెక్ చదువుతున్న ఇద్దరు పేద విద్యార్థులకు పలు సంస్థలు ఆర్థికసాయం చేశాయి. మనోహర్ ట్రస్ట్, అమెజాన్ ఎంప్లాయిస్ గ్రాంట్ సహకారంతో ఇద్దరికి రూ.70 వేల ఆర్థిక సాయం అందించామని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ శ్రీనగర్ కాలనీ పార్కులో వెలసిన అక్రమ కట్టడాలను మంగళవారం డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో సిబ్బందితో కలిసి కూల్చివేయించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జాచేసి అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అల్వాల్: ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతిని పురస్కరించుకుని వెంకటాపురంలోని మహాబోధి విద్యాలయంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సహకారంతో, అంబేడ్కర్ విద్యానికేతన్ ట్రస్ట్‌తో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విమల గద్దర్, మహాబోధి విద్యాలయ కరెస్పాండెంట్ డాక్టర్ వెన్నెల గద్దర్‌లు హాజరై ప్రారంభించారు. ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు, దంత పరీక్షలు, రక్త పరీక్షలు, ఎక్స్‌రే, ఈసీజీ వంటి సేవలను ఉచితంగా అందించారు. జవహర్ కెన్నడీ, జయంత్, కాంగ్రెస్ పార్టీ నేత బాబీ, పాఠశాల పరిపాలనాధికారి రాము, ప్రిన్సిపాల్ భవానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: ఒత్తిడి లేకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్, నిజాం కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వప్నజ్యోతి సూచించారు. మంగళవారం జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో విద్యార్థులు, తల్లితండ్రులకు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. పరీక్షలకు సంబంధించిన టైం టేబుల్ ముందుగానే తెలుస్తుందని, ప్రణాళిక ప్రకారం సబ్జెక్టులను చదువుకోవాలని సూచించారు. చదవడం ఎంత ముఖ్యమో దానిని మననం చేయడం కూడా అంతే ముఖ్యమన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలపై ఒత్తిడి తీసుకుని రాకుండా వారు చదువుకునే వాతావరణాన్ని కల్పించాలన్నారు. ఈ సందర్భంగా శరత్‌చంద్ర ఫౌండేషన్ తరుపున విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు వీరేశం, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 9న తైబజార్ వేలం

కీసర: నాగారం మున్సిపాలిటీలో 2024–25 సంవత్సరానికి సంబంధించి తైబజార్ వేలంను ఫిబ్రవరి 9న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని నాగారం, రాంపల్లికి సంబంధించి నిర్వహించనున్న వేలంలో పాల్గొనే వారు ఫిబ్రవరి 8న గురువారం సాయంత్రం 5 గంటల్లోగా (కమిషనర్ నాగారం మున్సిపాలిటీ) పేరు మీద రూ. 2 లక్షల డిడి తీసి నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

లారీ ఎక్కిన రైలు..



సాధారణంగా రైళ్లు పట్టాలపై పరుగెడుతుంటాయి.అయితే ఫ్యాక్టరీలో తయారైన ఓ రైల్ ఇంజిన్‌ను అధికారులు మంగళవారం లారీపై 44వ జాతీయ రహదారిపై మేడ్చల్ మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా వాహదారులు, ప్రజలు ఆసక్తిగా చూశారు. అంతేగాకుండా తమ కెమెరాల్లోనూ ఆ చిత్రాన్ని బంధించారు. – మేడ్చల్

బాధితులకు అండగా ఉంటాం..

- జయగిరి ఆలయ భూముల్లోని నివాసితులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి భరోసా
- హైకోర్టు స్టే పత్రాలను కార్పొరేటర్‌తో కలిసి అందజేత

గౌతంనగర్: జయగిరి లక్ష్మీనర్సింహ్మ స్వామి ఆలయ స్థలాల్లో నివాసం ఉంటున్న బాధితులకు అండగా ఉంటానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆలయ భూముల్లో గత దశాబ్దకాలంగా నివాసం ఉంటున్న నివాసితులకు ఇటీవల ఆలయ ఈఓ రమాదేవి నేతృత్వంలో నోటీసులు అందజేసి ఇళ్లకు సీజ్ చేశారు. స్పందించిన ఎమ్మెల్యే బాధితులకు అండగా నిలిచి హైకోర్టు స్టే ద్వారా బాధితులకు స్థానిక కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్‌తో కలిసి మంగళవారం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎండోమెంట్ అధికారులు వచ్చి మళ్లీ ఇబ్బంది పెడితే భయాందోళనకు గురికావొద్దన్నారు. బాధితుల పక్షాన ఉండి శాశ్వతంగా సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బాధితులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. నాయకులు మేకల రాముయాదవ్, సత్యనారాయణ, క్రిష్ణగౌడ్, సిద్ది రాములు, రాజా, బైరు అనిల్, బాబీ, మల్లేష్ మాదవ్, అనిత తదితరులున్నారు.

బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన..

డివిజన్ పరిధిలోని రాజా శ్రీనివాసనగర్, మిర్జాల్‌గూడలో జరుగుతున్న రైల్వే అండర్ బాక్స్ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ సునీత రాముయాదవ్‌లతో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం గౌతంనగర్ రైల్వేగేట్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించిన డ్రైయింగ్‌మ్యాప్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు.

ఇందిరానెహ్రూనగర్‌లో..

ఇందిరానెహ్రూనగర్‌లోని ఎత్తు ప్రాంతంలో ఉన్న ఇళ్లకు తాగునీటిని హైప్రెషర్ ద్వారా నీటిని అందించడానికి ఏర్పాటు చేసిన బూస్టర్‌ను మంగళవారం ఎమ్మెల్యే కార్పొరేటర్ సునీతతో కలిసి ప్రారంభించారు.



కోర్టు స్టే పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సునీత



గౌతంనగర్‌లో ఆర్‌యూబీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



ఇందిరానెహ్రూనగర్‌లో సరఫరా నీటిని పరిశీలిస్తున్న దృశ్యం

'ఆటో డ్రైవర్లను రోడ్డున పడేశారు'



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిశారు. ఉప్పల్ నియోజకవర్గంలో ఆటో డ్రైవర్ల సమస్యలు కేంద్రమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంగళవారం బీఎల్ఆర్ మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం సరైందేనైనా.. ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపిందని, ఆదాయం లేక వారి కుటుంబాలు గడవలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి వారి రోజువారీ ఆదాయానికి ప్రభుత్వం గండి కొట్టిందని ఆరోపించారు. ఆటో డ్రైవర్లను ఆదుకునేలా కృషి చేయాలని కోరారు. తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, వారి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామని కేంద్రమంత్రి చెప్పారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

రోడ్డుపై వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు

బోడుప్పల్: రోడ్డుపై ఇష్టానుసారంగా వ్యర్థాలను పారవేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బోడుప్పల్ కమిషనర్ జి. వేణుగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. సుద్ధకుంట వద్ద సీసీరోడ్డు వ్యర్థాలను వేసిన వ్యక్తికి రూ. 10వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక ముందు ఇలాంటి అతిక్రమణలకు పాల్పడిన వారిపై మున్సిపల్ యాక్ట్ 2019ను అనుసరించి భారీ జరిమానాలతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైన రోడ్డు పక్కన, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు, చెత్త చెదారం వేసిన వారిపై కార్యాలయ కంట్రోల్ రూం నెంబరు 040-27215959కు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు.

కన్సల్టేటివ్ సభ్యుల నియామకం

కుషాయిగూడ: చర్లపల్లి టర్మినల్ అభివృద్ధి పనుల్లో భాగస్వాములను చేస్తూ.. చర్లపల్లికి చెందిన పలువురు బీజేపీ నేతలు కన్సల్టెటివ్ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం ఎస్.కే.సిన్హా, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ఎల్.ఎస్.ఆర్. మూర్తి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో చర్లపల్లికి చెందిన బీజేపీ నాయకులు కొమ్ము నర్సింగరావు, నాగమణి, లక్ష్మణ్‌గౌడ్, చల్లా ప్రభాకర్ ఉన్నారు. ఈ కమిటీ కాలపరిమితి మూడేళ్లు ఉంటుంది.

హెరిటేజ్ క్విజ్‌కు ఎంపికైన విద్యార్థులు



ఉప్పల్: ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జోస్, ప్రహ్లాద్, విహార్‌లు దక్షిణాది నుంచి ఢిల్లీలో జరగనున్న సీబీఎస్ఈ హెరిటేజ్ క్విజ్ పోటీలకు ఎంపికయ్యారు. పూణేలోని ఎస్‌బి పటేల్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన జూనియర్ రోబోటిక్స్ కప్ పోటీల్లో మెల్విన్, వెంకట శివ కుమార్ తమ ప్రతిభ చాటారు. వారు తయారు చేసిన మోడల్ ఉత్తమమైందిగా ఎంపికైంది. వీరితో పాటు రెండో టీమ్‌లో మనీష్, విశ్వక్ సాయి, అమన్‌లు మూడో బహుమతి గెలుచుకుని ఆసియా పసిఫిక్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు స్కూల్ యాజమాన్యం ప్రకటించింది.

భక్తి శ్రద్ధలతో త్యాగరాజ ఆరాధనోత్సవాలు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని వాణినగర్‌లో విజయ వినాయక ఆలయంలో మంగళవారం సాంప్రదాయ సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

వాహనాల చోరీలో నిందితుడి రిమాండ్

రూ.3.5 లక్షల విలువైన వాహనాలు స్వాధీనం

కుషాయిగూడ: ఇంటి ముందు పార్క్ చేసిన వాహనాలను దొంగిలిస్తున్న ఓ పాత నేరస్థుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద రూ.3.5 లక్షల విలువైన వాహనాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కుషాయిగూడ డీఐ సాయిప్రకాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడ సాయినగర్‌లో నివసించే రాకోలు భానుచందర్ (22) సెంట్రింగ్ పనిచేస్తూ.. కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నాడు. 7వ తరగతిలోనే చదువు మానేసి సెంట్రింగ్ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. తన సంపాదన వ్యసనాలకు సరిపోకపోవడంతో దొంగతనం బాట పట్టాడు. రాత్రి సమయంలో ఇళ్ల ముందు పార్కు చేసిన వాహనాలను దొంగిలించడం మొదలుపెట్టాడు. ఇలా దొంగిలించిన వాహనాలను ఇంట్లో ఉంచి తన అవసరానికి తగ్గట్టుగా వాహనాల విడి భాగాలను అమ్ముకుంటూ.. జల్సాలు చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ, ఎన్‌టీఆర్‌నగర్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా.. అనుమానాస్పదంగా కనిపించిన భానుచందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. అసలు విషయం బయటికి వచ్చింది. 2021లో ఆటో దొంగిలించిన కేసులో జైలుకు వెళ్లి వచ్చాడని, కుషాయిగూడ, మల్కాజిగిరి, లాలాగూడ, మొగల్‌పురా, పోలీస్‌స్టేషన్లలో అతడిపై కేసులు నమోదైనట్లు గుర్తించినట్లు డీఐ తెలిపారు. నిందితుడి నుంచి రూ.3.5 లక్షల విలువైన ఆటో, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

చైన్ స్నాచింగ్‌లో మరో ఇద్దరు..



అల్వాల్: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను నేరేడ్‌మెట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 28న నేరేడ్‌మెట్ కృపా కాంప్లెక్స్ వద్ద ఇంటిముందు పనిచేస్తున్న వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. బాధితురాలు విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా.. సికింద్రాబాద్ తాడ్‌బండ్‌కు చెందిన సుమిత్‌నాయక్ (20) బోలక్‌పూర్‌కు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ (20)లను నిందితులుగా గుర్తించారు. వీరిలో సుమిత్ గత మూడేళ్లుగా నగరంలోకి పలు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన 15 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. వీటిలో సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో చికోటి ప్రవీణ్ కారు కూడా ఉన్నట్టు సమాచారం. నిందితుల నుంచి మూడున్నర తులాల బంగారు గొలుసు, మూడు సెల్‌ఫోన్లు, హోండా యాక్టివాను స్వాధీనం చేసుకున్నారు. మల్కాజిగిరి డీసీపీ పద్మజా, పోలీస్ సిబ్బందిని అభినందించారు.